# గడ్డు పరిస్థితుల నుంచి పార్టీనీ, విప్లవోద్యమాన్నీ పురోగమింపచేయడానికి తుదివరకూ బోల్షెవిక్ పట్టుదలతో పోరాడి అసువులు బాసిన ప్రజావీరులు మృత్యుంజయులు!

జులై 28 మన అమరవీరుల సంస్మరణ దినం. భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ విజయానికై పోరాడుతూ అసువులు బాసిన వీరయోధులందరినీ సంస్మరించుకునే రోజు అత్థావీస్ జులై. 1972 జులై 28 నాడు మన పార్టీ సంస్థాపక నాయకులలో ఒకరు, భారత విప్లవ పథ నిర్దేశకులు కామ్రేడ్ చారుమజుందార్‌ను పశ్చిమబంగా పోలీసులు హత్య చేశారు. ఆ వీరయోధుడి సంస్మరణలో మన పార్టీ ప్రతియేటా జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని పాటిస్తోంది. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారం పాటించాల్సిందిగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ యావత్ పార్టీ కేడర్లకూ, పిఎల్‌జిఎ గెరిల్లాలకూ, విప్లవ ప్రజాసంఘాలకూ, జనతన సర్కార్లకూ, విప్లవ ప్రజానీకానికీ పిలుపునిస్తోంది. ఈ సందర్భంగా డికెఎస్‌జడ్‌సి 2014 ఆగస్టు నుంచి 2015 జులై వరకు భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన వీరయోధులందరికీ పేరు పేరునా వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తోంది. దండకారణ్య విప్లవోద్యమంలో ఈ సంవత్సర కాలంలో 5గురు మహిళలతో సహా 25 మంది కామ్రేడ్స్‌ను మనం కోల్పోయాం. వీరిలో మెజారిటీ కామ్రేడ్స్ శత్రువుతో తలపడుతూ లేదా వాడు జరిపిన బూటకపు ఎదురు కాల్పులలో ఆశయసిద్ధి కోసం అసువులు బాసినవారే. పార్టీ అప్పగించిన విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో నేలకొరిగిన ప్రజావీరుల త్యాగాలు వృథా పోవు. వారందరికీ ఎస్‌జడ్‌సి పేరు పేరునా విప్లవాంజలులు ఘటిస్తోంది.

దేశంలోని మన పార్టీని సమూలంగా నిర్మూలించే వినాశకర లక్ష్యంతో గత ఆరేళ్లుగా కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా గ్రీన్‌హంట్ ఆపరేషన్ బహుముఖ దాడులను కొనసాగిస్తున్నాయి. ఈ దాడుల ఫలితంగా తొలి సంవత్సరాలలో మన పార్టీ, విప్లవోద్యమం భారీ నష్టాలనే చవిచూసింది. అవసరమైన ఎత్తుగడలు చేపట్టడంలో వైఫల్యం, లోపభూయిష్టమైన కార్యశైలి ఫలితంగానే దేశవ్యాప్త పార్టీ, విప్లవోద్యమం గడ్డు పరిస్థితులకు చేరుకుందనీ 2013 మొదట్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటి అంచనా వేసింది. దీని నుంచి బయటపడడానికి మన పార్టీ బోల్షెవీకరణ అభియాన్ చేపట్టి గత రెండేళ్లుగా కొనసాగిస్తోంది. మన మధ్య రీజియన్‌లో బోల్షెవీకరణ అభియాన్ సత్ఫలితాలను ఇస్తోందని సమీక్షించుకొని యేడాది పూర్తికావస్తున్నది. ఆ కృషిని మరింత చురుగ్గా, మరింత వేగవంతం చేస్తూ సఫలం చేసే దిశలోనే ఈ ప్రజావీరులు తమ ప్రాణాలను ధారపోశారు. వారి కృషిని మరింత మునుముందుకు తీసుకుపోతామనీ, వారి ఆశయాలను సఫలం చేసితీరుతామనీ అమరవీరుల సంస్మరణ వారంలో మనమంతా శపథం చేద్దాం.

మన దేశ విప్లవోద్యమం దాదాపు గత ఐదు దశాబ్దాలుగా అనేక ఆటు పోట్లను ఎదుర్కొంటూనే బలపడుతూ పురోగమిస్తూ వస్తోంది. కా. చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీల నాయకత్వంలో సాగిన నగ్జల్బరీ నుండి నేటివరకూ ఉద్యమం ఈ విషయాన్ని పదే పదే రుజువవుతోంది. ప్రపంచంలో ఇప్పటివరకు జయప్రదమైన రష్యా, చైనా సహా ఏ దేశ విప్లవోద్యమమైనా ఇందుకు మినహాయింపేమీ కాదు. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో వీలైనంత తక్కువ సమయంలో మన దేశ విప్లవోద్యమాన్ని జయప్రదం చేయడానికి ఇప్పటివరకు ఈ దిశలో అసమాన త్యాగాలు చేసిన దాదాపు 15 వేల మంది మృత్యుంజయుల అమర చరిత్రలు మన ముందున్నాయి. గత 50 ఏళ్ల కాలంలో దోపిడీ పాలక వర్గాలు సాగించిన అనేక అణచివేత దాడులను, కేంపెయిన్‌లను ఓడిస్తూనే మన విప్లవోద్యమం ఈ స్థాయికి చేరుకుందని ఈ మధ్యే 2014 సెప్టెంబరులో మనం జరుపుకున్న మన కొత్త పార్టీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సమీక్షించుకున్నాం. ఆ అనుభవాల వెలుగులోనే భవిష్యత్ విప్లవోద్యమాన్ని జయప్రదం చేసి తీరుతామనీ బోల్షెవిక్ సంకల్పంతో ప్రతిన బూనుదాం.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ బహుముఖ దాడులను ఎదుర్కొంటూ, తిప్పికొడుతూ వాటిని ఓడించే తక్షణ కర్తవ్యంలో భాగంగా దండకారణ్యంలో బహుముఖ ప్రతిఘటనలో భాగంగా ప్రజా గెరిల్లా యుద్ధం కొనసాగుతోంది. ప్రజా విప్లవ ఉద్యమాన్నీ, ప్రజల రాజ్యాధికారాన్నీ వ్యూహాత్మక ప్రాంతాలలో నిలబెట్టడంలో భాగంగా కసాలపాడ్, పిడిమేల్, పఖంజూర్, బాందే, కల్లెడ, మర్సుకోలా, మూస్‌పర్శి, బాసింగ్‌లలో మన వీరగెరిల్లాలు ఎత్తుగడలపర ఎదురుదాడులు చేసి శత్రువును మట్టిగరిపించి పార్టీని రక్షిస్తూ ప్రజల రాజ్యాధికారాన్నీ, ప్రజా విప్లవోద్యమాన్నీ నిలబెడుతూ ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చడానికి గొప్ప కృషి చేస్తున్నారు. అందులో భాగంగా దానిని వినియోగించుకుంటూ ప్రజలు తమ మనుగడ కోసం విస్థాపన వ్యతిరేక, రాజ్యహింస వ్యతిరేక పోరాటాలలో పాలకవర్గాలతో, వారి పోలీసు, కమాండో, అర్ధసైనిక బలగాలతో తలపడుతున్నారు. పోలీసులు బూటకపు ఎదురు కాల్పులలో రేవాల్ కా. నూప బీమా,... కోసాలను హతమార్చడానికి వ్యతిరేకంగా ప్రజలు రాజ్యాన్ని నిలదీశారు. కమాండో బలగాలు ఉదేరా(గడ్‌చిరోలి) గ్రామంలో మైనీ పుంగాటి అనే మహిళపై జరిపిన దౌర్జన్యానికి వ్యతిరేకంగా వేలాదిమంది ప్రజలు సి–60 కమాండోలతో తలపడ్డారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ఎన్‌డిఎ ప్రభుత్వం తలపెట్టిన భూసేకరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడే వేలాది జనం రోడ్లపైకి వచ్చి రోజుల తరబడి నిరసన ప్రదర్శనలు జరిపారు. రాజకీయ ఖైదీల విడుదల కోసం దంతెవాడ జైలు ముందు వందలాది మంది ప్రజలు డిమాండు చేస్తుంటే వారిపై పోలీసులు జరిపిన లాఠీ చార్జీని ఖండిస్తూ నినదించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తలపెడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ దండకారణ్య ప్రజలు ఎక్కడికక్కడే మిలిటెంటు ఉద్యమాలను నిర్మిస్తున్నారు. ఈ ఉద్యమాలన్నీ అమరవీరుల నెత్తుటి త్యాగాల

ఫలితమేనన్నది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. ఈ అమరవీరుల సుందర స్వప్నాలు, ఆదర్శాలు, త్యాగాలు గత ఐదేళ్లలో ఎన్నడూలేని సంఖ్యలో తిరిగి నూతన భర్తీలకు దారులు తెరిచాయి. ఆ పోరాటాలన్నింటినీ వారి స్మృతిలో మరింత మిలిటెంటుగా ముందుకు తీసుకెళ్లి ప్రజల ఆశయాలకు, ఆకాంక్షలకు, విప్లవోద్యమ అంతిమ లక్ష్యానికి పునరంకితమవుతామనీ శపథం చేద్దాం. అదే వారికి ఈ సందర్భంగా అర్పించే నిజమైన నివాళి.

కామ్రేడ్స్!

గత సంవత్సరం కేంద్రంలో ఎన్నికైన నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రమాదకర వేగంతో ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలకు పూనుకుంటున్నది. నరేంద్ర మోదీ దేశ, విదేశ కార్పొరేటు వర్గాలకు పూర్తి నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్నాడు. దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభ పరిష్కారానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే తిరుగులేని విధానంగా ప్రచారం చేస్తున్నాడు. అందుకు గానూ 'మేక్ ఇన్ ఇండియా' అంటూ మహా ఆర్భాటంగా విదేశీ పర్యటనలు విరివిగా చేస్తున్నాడు. తమ పాలనా పనితీరును తమకు తామే తెగ పొగుడుకుంటూ వేడుకలు జరుపుకుంటూ దేశంలో మున్నెన్నటికన్నా తీవ్రంగా మత విద్వేషాలను రెచ్చగొడుతూ, హింసా దౌర్జన్యాలకు సంఘ్ ముఠా పాల్పడుతున్నారు. పార్లమెంటు ఎన్నికల చరిత్రలోనే కని విని ఎరుగని రీతిలో కోట్లాది రూపాయిల కొల్లసొమ్ముతో ఎన్నికైన మోదీ తన పాలనలో అవినీతి మచ్చుకైనా లేదంటూ గోబెల్స్ ప్రచారానికి పూనుకోవడం బిజెపి లాంటి ఫాసిస్టు సంస్థలకే చెల్లుతుంది. దేశ, విదేశ ఘరానా కార్పొరేటు శక్తులు తప్ప దేశంలోని పునాది వర్గాల ప్రజలంతా మోదీనీ, ఆయన కార్పొరేటు అనుకూల విధానాలను వ్యతిరేకిస్తున్నారు. జైతాపూర్ నుంచి కూడంకుళం వరకు, కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల నుండి దండకారణ్యం వరకు పీడిత ప్రజలు మోదీ విధానాల ఫలితంగా అనివార్యంగా పోరాటాల్లోకి దిగుతున్నారు. ఈ పోరాటాలు మరింత తీవ్రం అయి తీరుతాయనే ముందు చూపుతోనే విప్లవకారులకు, సాయుధ పోరాట సంస్థలకు మోదీ సాయుధ పోరాట విరమణకు పిలుపులు ఇస్తున్నాడు. మేలో దంతెవాడ పర్యటించిన మోదీ మావోయిస్టులు శాంతియుత జీవనంలోకి రావాలనీ పిలుపునిస్తూ గన్నులు వదిలి భుజాలపై నాగళ్లు ధరించాలని కోరాడు. కానీ పాలకవర్గాలు సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలింతంగానే ఈ దేశంలోని రైతాంగం, విద్యార్థులు, యువత కార్మికవర్గ నాయకత్వం సహా వివిధ పోరాట సంస్థల నాయకత్వంలో పోరాడుతున్నారనీ, మోదీ విధానాలు వారిని మరింత గట్టిగా తమ అస్థిత్వం కోసం పోరాడేవైపు నెడుతున్నాయి. ఇది నేటి వాస్తవం. ఇందులో భాగంగానే గత దశాబ్ది కాలంలో ఎన్నడూలేని విధంగా మణిపూర్‌లో దాదాపు 30 మంది భారత సైనికులను జూన్ 4 నాడు అక్కడి గెరిల్లాలు దెబ్బతీశారు. అక్కడ తాజాగా వరుసగా భారత సైనికులను మట్టిగరిపిస్తున్న దాడుల్లో ఇది అతి పెద్దది. అయిదవది. దోపిడీ పాలక వర్గాలు ప్రజలను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని కుసంస్కరణలను ప్రవేశపెట్టినా, పోరాట సంస్థల నాయకత్వం ద్రోహాలనకు, దిగజారుళ్లకు, బూటకపు శాంతి చర్చలకు ఒడిగట్టినా అవన్నీ తాత్కాలికమేనంటూ దేశంలో పెచ్చరిల్లుతున్న ప్రజా పోరాటాలు, గెరిల్లా దాడులు నిరూపిస్తున్నాయి. ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీర్ఘకాల పోరాటాలలో అసువులు బాసిన అనేకమంది ప్రజావీరుల త్యాగాలు నిత్యం ప్రజల హృదయాలలో పొటమరిస్తుండగా దోపిడీ నేతల శుష్క శాంతి వచనాలు వారినెన్నటికీ పోరాటాల నుంచి శాశ్వతంగా దూరం చేయలేవు. కశ్మీర్, ఈశాన్యం, దండకారణ్యం, బిహార్, ఝార్ఖండ్, లాల్‌గఢ్, నారాయణపట్నా పేరు ఏదైనా కావచ్చు, అవన్నీ భారతదేశ రాజకీయ చిత్రపటంపై అమరుల నెత్తుటి త్యాగాలతో ఎరుపుమయమైన ప్రాంతాలే! అక్కడి ప్రజలను దోపిడీ పాలక వర్గాల ఏ ఎల్‌ఐసి విధానాలు కానీ వాటి 'మది, మస్తిష్కాలను గెలుచుకునే' కుతంత్రాలు గానీ చెల్లవనీ కాలం హెచ్చరిస్తున్నది. వారంతా మరింత సమైక్యంగా విప్లవకరంగా భారత విస్తరణవాద, ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించి తీరుతారు. మోదీ ప్రభుత్వం తన భూస్వామ్య, సామ్రాజ్యవాద శక్తులతో కలిసి దేశాన్ని ప్రజా పోరాటాల సుడిగుండంలోకి నెడుతోంది. కానీ, వారు ఎన్నటికీ ఆ సుడిగుండం నుంచీ గట్టెక్కలేరనీ, ప్రజా పోరాటాలే వారికి ఘోరీ కడుతాయనీ అమరుల సాక్షిగా నిరూపిద్దాం. ప్రపంచంలోని అనేకదేశాల ప్రజలు ముఖ్యంగా శ్రమజీవులు మన పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రజా యుద్ధాన్ని ఎత్తిపడుతున్నారు. మోదీ వెళ్లిన టోరంటో సహా అనేకచోట్ల ఎన్నెన్నో సంస్థలు గ్రీన్‌హంట్ నశించాలంటూ, మోదీ ప్రజా వ్యతిరేక కార్పొరేటు అనుకూల విధానాలు నశించాలంటూ నినదిస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. వారందరి ఆశలు, ఆశయాలకు ప్రతి రూపంగా పురోగమిస్తోన్న భారత ప్రజా యుద్ధాన్ని మరింత తీవ్రం చేసి అమరుల స్వప్నాలను నిజం చేయడానికి తుదివరకూ పోరాడుతామనీ, గడ్డు కాలాలెన్నైనా బోల్షెవిక్ పట్టుదలతో అధిగమిస్తామనీ శపథం చేద్దాం.

☆ అమరవీరులకు జోహార్లు, అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!

☆ గడ్డుకాలాలు విప్లవోద్యమంలో అనివార్యం, బోల్షెవిక్ పట్టుదలతో వాటన్నింటినీ జయిద్దాం!

☆ పీడిత ప్రజల ఆగ్రహాన్ని మూట కట్టుకుంటున్న మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాయుద్ధం ద్వారా ఓడిద్దాం!

☆ జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణవారం బోల్షెవిక్ దీక్షతో పాటిద్దాం! గ్రామగ్రామాన స్థూపాలను నిర్మిద్దాం! గ్రామాలలో ఉన్న స్థూపాలను అలంకరిద్దాం! అమర వీరుల పోరాట చరిత్రను విరివిగా ప్రచారం చేద్దాం!

తేదీ : 15 జూన్ 2015

విప్లవ వందనాలతో

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి

**భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)**